
వరల్డ్ వాటర్ డే



జలం.. జలగలు.!

సేవ్ వాటర్ టుడే



• ఇష్టానుసారంగా బోర్ల ఏర్పాటు • 24గంటలు నీటిని తోడుతూ వ్యాపారం • అడుగంటుతున్న భూగర్భ జలాలు

స్వచ్ఛమైన జలాలను కొందరు జలగలు తోడేస్తున్నారు. కాసులకు కక్కుర్తి పడుతూ భవిష్యత్ తరాలకు విఘాతం కలిగిస్తున్నారు. సమస్త జీవ కోటికి జలమే ప్రాణాధారం.. నీరు లేకపోతే మానవాళి మనుగడే ప్రశ్నార్థకంగా మారుతుంది. అలాంటి నీటిని అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇప్పటికే పంచభూతాల్లో గాలి, భూమిలో రసాయనాలను వెదజల్లుతూ కలుషితం చేస్తున్నారు. ప్రస్తుతం నీటిని తోడేస్తూ భూగర్భ జలాలు అడుగంటేలా చేస్తున్నారు. శుక్రవారం జరిగిన వరల్డ్ వాటర్ డే సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం.

దుండిగల్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో నీటి వ్యాపారం జోరుగా సాగుతుంది. అసలే వేసవి కాలం కావడంతో ఇప్పటి నుంచే నీటి ఎద్దడి మొదలైంది. నిజాంపేట, కొంపల్లి, దుండిగల్ ప్రాంతాల్లో గడిచిన నాలుగేళ్లల్లోనే వేలాదిగా అపార్ట్‌మెంట్లు, వెంచర్లు, కాలనీలు వెలిశాయి. నగర శివారు ప్రాంతం కావడంతో వేగంగా అభివృద్ధి చెందుతుంది. దీంతో ఆయా ప్రాంతాల్లో నీటి సమస్య తీవ్రంగా ఉంది. దీనిని ఆసరాగా చేసుకున్న కొందరు వ్యక్తులు నీటి వ్యాపారానికి తెర లేపారు.


బోర్ మోటార్లతో సంపుల్లో నీటిని నింపుతున్న దృశ్యం

విచ్చలవిడిగా బోర్ల ఏర్పాటు..

దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లో వందల సంఖ్యలో బోర్లు వేసి నీటిని తోడేస్తున్నారు. ముఖ్యంగా బౌరంపేటలో ఈ తంతూ జోరుగా సాగుతుంది. ఇందిరమ్మ కాలనీకి వెళ్లే దారి, కత్వ చెరువు, చెరువు కట్ట తదితర ప్రాంతాల్లో విచ్చలవిడిగా బోర్లు వేశారు. చెరువుల సమీపంలో, పంట పొలాలు, పట్టా భూముల్లో బోర్లు వేసి సంపులను నిర్మించారు. ఒక్కో సంపులోకి మూడు, నాలుగు బోర్ల నుంచి నిత్యం నీటిని తోడుతున్నారు. ఆపై ట్యాంకర్ల ద్వారా నీటిని తరలిస్తున్నారు.

రోజుకు 20లక్షల లీటర్ల తరలింపు..

నీటి సమస్య తీవ్రంగా ఉన్న ప్రాంతాలను ఎంచుకున్న నీటి వ్యాపారులు ఇక్కడి నుంచి ప్రతి రోజు 20 లక్షల లీటర్ల నీటిని తరలిస్తున్నారు. నిజాంపేట, బాచుపల్లి, ప్రగతినగర్, జేఎన్‌టీయూ, కేపీహెచ్‌బీకాలనీ తదితర ప్రాంతాల్లోని అపార్ట్‌మెంట్లు, నూతన వాణిజ్య నిర్మాణాల సముదాయాలు, పరిశ్రమలకు ఈ నీటిని తరలిస్తున్నారు. ఒక్కో ట్యాంకర్‌కు రూ.1500 నుంచి రూ.2వేల వరకు వసూలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

పట్టించుకోని అధికారులు..

కేవలం బౌరంపేటలోనే ఇలా పదుల సంఖ్యలో పక్క పక్కనే బోర్లు వేసి నీటి సంపులను ఏర్పాటు చేశారు. అందులో రాత్రి, పగలు అనే తేడా లేకుండా నీటిని నిల్వ చేస్తు ట్యాంకర్ల ద్వారా నీటిని అమ్ముకుంటున్నారు. నీటిని విక్రయించడమే కాకుండా భూగర్భ జలాలు అడుగంటుతున్నా రెవెన్యూ అధికారులు ఇటు వైపు కన్నెత్తైనా చూడడం లేదు.

6 బోర్లు, 3 ట్యాంకర్లు సీజ్: తహసీల్దార్

ఇదే విషయంపై గండిమైసమ్మ–దుండిగల్ మండల తహసీల్దార్ సయ్యద్ అబ్దుల్ మతిన్‌ను 'సాక్షి' వివరణ కోరగా మంచి నీటి వ్యాపారం తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇప్పటికే 10 మందికి నోటీసులు జారీ చేశామని తెలిపారు. ఆరు బోర్లు, మూడు ట్యాంకర్లను సీజ్ చేశామని పేర్కొన్నారు. నీటిని అమ్ముకుంటున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.


ట్యాంకర్ల ద్వారా నీటిని తరలిస్తూ...

వాల్టా.. ఉల్టా.!

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ 2002లో వాల్టా చట్టాన్ని అమలులోకి తీసుకొచ్చింది. నీరు, భూమి, చెట్లలను పరిరక్షించే విధంగా ఈ చట్టాన్ని రూపొందించారు. కొత్తగా ఎవరైనా బోరు వేయాలంటే తప్పనిసరిగా రెవెన్యూ తహసీల్దార్ అనుమతి తీసుకోవాలి. నూతనంగా బోరువేసే ప్రాంతంలో గతంలో 100 మీటర్లలోపు బోరు ఉంటే అనుమతులు ఉండవు. ఇలా నిబంధనలకు విరుద్ధంగా వేసిన బోర్లను సీజ్ చేసి చర్యలు తీసుకునే అధికారం రెవెన్యూ అధికారులకు ఉంటుంది.

నీరు, విద్యుత్ వినియోగాన్ని తగ్గించాలి

గచ్చిబౌలి: ప్రతి ఒక్కరూ నీరు, విద్యుత్ వినియోగాన్ని గణనీయంగా తగ్గించాల్సిన అవసరం ఉందని ఈపీటీఆర్‌ఐ డీజీ, పర్యావరణం, అటవీ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖల ముఖ్య కార్యదర్శి వాణిప్రసాద్ అన్నారు. ప్రపంచ నీటి దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం గచ్చిబౌలిలోని ' బిల్డింగ్ క్లైమేట్ రెసిలీయన్స్ ఫర్ వాటర్ సెక్టార్' అనే అంశంపై వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేడి పెరుగుతున్న తరుణంలో ఏసీల వినియోగం పెరుగుతోందని, తద్వారా వేడి కూడా మరింతగా పెరిగిపోతుందన్నారు. భవిష్యత్తు తరాలకు మంచి వాతావరణాన్ని అందించాలన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి విజయకుమార్, ఈపీటీఆర్‌ఐ ప్రొఫెసర్ ఏకే గోసేన్, ఐఐటీ ఢిల్లీ ప్రొఫెసర్ ఎంవిఎస్ఎస్ గిరిధర్, సత్యనారాయణ, సుధీర్‌కుమార్, డా.రాజేశ్వర్, డా. శేష శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

నీటి కోసం పోరాటం చేయాల్సిన రోజులు వచ్చాయి..

రాయదుర్గం: మనిషి ప్రస్తుతం నీళ్ల కోసం పోరాటం చేయాల్సిన రోజులు వచ్చాయని విశ్రాంత ఐఏఎస్ అధికారి ఎం జగదీశ్వర్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో ప్రపంచ నీటి దినోత్సవంను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ దేశాల మధ్య నీటి కోసం యుద్ధాలు జరుగుతున్నాయన్నారు. నీటి పొదుపును పాటించాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వరరావు మాట్లాడుతూ ప్రపంచ నీటి దినోత్సవాలు చేసుకున్నప్పటికీ ప్రజలు నీటి పొదుపు పాటించినప్పుడు మాత్రమే ఈ ఉత్సవాలకు అర్థం ఉంటుందన్నారు.

లాజిస్టిక్స్‌లో స్టార్టప్‌లను ప్రోత్సహించాలి

మాదాపూర్: లాజిస్టిక్స్ ప్రపంచ వాణిజ్యానికి జీవనాధారమని తెలంగాణ రాష్ట్ర ఇండస్ట్రీస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఎండి డాక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. మాదాపూర్‌లోని హెచ్‌ఐసీసీలో శుక్రవారం ఎంఎస్ఎంఈ శాఖ, భారత ప్రభుత్వం మద్దతుతో తెలంగాణ చాంబర్స్ అండ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ షిప్పింగ్, లాజిస్టిక్స్ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు లాజిస్టిక్స్‌పై తీవ్ర ప్రభావం చూపుతున్నాయన్నారు. పరిశ్రమ సాంకేతికతకు అనుగుణంగా మద్దతు ఇవ్వాలని, లాజిస్టిక్స్‌లో స్టార్టప్‌లను ప్రోత్సహించాలని వారు కీలక పాత్ర పోషిస్తారని తెలిపారు. ప్రభుత్వం ప్రణాళిక బద్ధమైన ప్రధాన ప్రాజెక్టులైన భరత్‌మాల ఇది దేశవ్యాప్తంగా రహదారి కనెక్టివిటీని లక్ష్యంగా చేసుకుంటుందన్నారు. సాగరమాల ప్రాజెక్టు తీర రేఖ వెంబడి ఆధునీకరించిన ఓడరేవుల అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఇంటిగ్రేటెడ్ ఇండస్ట్రీయల్ టౌన్‌షిప్‌తో వస్తున్నామని తెలిపారు. హైదరాబాద్‌కు ఔటర్ రింగురోడ్డు ఉండడం వల్ల భారీ ప్రయోజనం ఉందన్నారు. అదే విధంగా రాష్ట్రానికి ప్రాంతీయ రింగురోడ్డు ఉంటుందన్నారు. ఇది నాలుగు లేన్‌లు, యాక్సిస్ నియంత్రిత డిజైన్‌ను కలిగివున్న 340 కి.మీ రింగురోడ్డు లాజిస్టిక్స్‌లో ఎంఎస్ఎంఈ భారీపాత్ర పోషిస్తుందన్నారు.

నీటిని పొదుపుగా వాడుకుందాం


నీటి పొదుపుపై అవగాహన కల్పిస్తున్న జలమండలి భరత్‌నగర్ సబ్‌డివిజన్ డీజీఎం రవి

మోతీనగర్: వరల్డ్ వాటర్ డే సందర్భంగా శుక్రవారం అల్లాపూర్ డివిజన్ గాయత్రినగర్లో నీటిని పొదుపుగా వాడుకోవాలని, నీటి లభ్యత గురించి నీటి ఆవశ్యకత గురించి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీఎం రవి మాట్లాడుతూ... వర్షపునీరు వృథా కాకుండా ప్రతి ఒక్కరి ఇంట్లో ఇంకుడు గుంత తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. వేసవి కాలంలో ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వాడుకోవాలన్నారు. ప్రస్తుతం బెంగళూరులో నీటి కొరత కారణంగా ఎన్నో అవస్థలు పడుతున్నారని గుర్తు చేశారు. స్వచ్ఛమైన తాగునీటిని అవసరం మేరకే వాడుకోవాలని సూచించారు. మోతీనగర్ జలమండలి మేనేజర్ విలియం ప్రకాష్ మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని ఏ విధంగా అయితే కాపాడుకుంటామో అదే విధంగా నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. ముఖ్యంగా వేసవిలో మంచినీటిని జాగ్రత్తగా వాడుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్వేచ్ఛ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రధాన కార్యదర్శి కోటయ్య, సిబ్బంది మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్కీ– జేబీఐఈటీ కళాశాల మధ్య ఒప్పందం

రాయదుర్గం: నైపుణ్యాలపై విద్యార్థులకు అవగాహన మరింత పెంచేందుకు ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా–జేబీఐఈటీ మధ్య ఒప్పందం కుదిరింది. రెండు సంస్థల ప్రతినిధులు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. అనంతరం 'ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్– మెషిన్ లెర్నింగ్ ఇంజనీర్' పై నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యు కేషన్, ఎంఎస్‌డీఈ మంత్రిత్వశాఖ స్పాన్సర్ చేసిన ఫ్లాగ్‌షిప్ చొరవతో ప్రత్యేక చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వరరావు మాట్లాడుతూ పరిశ్రమకు అవసరమైన నైపుణ్యాలను విద్యార్థులకు చదువుతోపాటు అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఇంజనీరింగ్ ప్రోగ్రామింగ్, కోడింగ్, ఎంప్లాయిబిలిటీ స్కిల్స్‌లో రాణించడానికి అవసరమైన శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. జేబీఐఈటీ ప్రిన్సిపల్ డాక్టర్ పిసి కృష్ణమాచారి, డైరెక్టర్ సిహెచ్ సంజయ్ ప్రసంగిస్తూ చదువుతోపాటు విద్యార్థులలో నైపుణ్యాలు పెంపొందిస్తే పోటీ పరీక్షలకు సన్నద్ధం కావడానికి అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో పలువురు ఎస్కీ, జేబీఐఈటీ అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీజేపీ వైపు బీఆర్‌ఎస్ నేతల చూపు.!

• బీఆర్‌ఎస్‌ను ఖాళీ చేస్తున్న సీనియర్లు • బీజేపీలో చేరేందుకు రంగం సిద్ధం
• మండల సీనియర్ నేతలు అటువైపే.. • ఇంటింటికీ వెళ్లి ఆహ్వానిస్తున్న ఈటల

మేడ్చల్: ఒకనాడు టీడీపీలో, కాంగ్రెస్‌లో ఉండి మేడ్చల్ మండల రాజకీయాలను శాసించిన బడా రాజకీయ నాయకులు అనంతరం బీఆర్‌ఎస్‌లో చేరి రాజకీయాలు చేశారు. ప్రస్తుతం వారు బీజేపీ వైపు అడుగులు వేస్తున్నారు.బీఆర్‌ఎస్‌లో ఎమ్మెల్యే మల్లారెడ్డి వ్యవహారశైలి నచ్చకున్నా అధికారంలో ఉన్నన్ని రోజులు అందులో ఉండి తాజాగా అవకాశం రావడంతో బీజేపీలో చేరడానికి ఆ పార్టీ అగ్ర నాయకుడు ఈటల రాజేందర్ స్వయంగా వారి వద్దకు వచ్చి ఆహ్వానాలు పలుకుతుండటంతో తమ పూర్వ వైభవం కోసం అడుగులు వేస్తున్నారు. అధిక మంది రాజకీయ నాయకులు టీడీపీలో పుట్టి పెరిగిన వారు కొందరూ ఉండగా, మరి కొందరు కాంగ్రెస్ నుంచి వచ్చిన వారు ఉన్నారు. బీఆర్‌ఎస్ గాలిలో తమ రాజకీయ జీవితం కనుమరుగవుతుందనే భయంతో కొంత మంది బీఆర్‌ఎస్‌లో చేరగా మరి కొంతమంది స్తబ్దుగా ఉండిపోయారు. బీఆర్‌ఎస్‌లో చీత్కారాలకు గురైన వారు అధికారం కోసం అందులోనే ఉండిపోయారు. తాజాగా బీఆర్‌ఎస్ పతనం దిశగా నడవడం, కాంగ్రెస్ నాయకులు గుర్తించకపోవడంతో అదే సమయంలో బీజేపీ వారు అక్కున చేర్చుకునే యత్నాలు చేస్తున్నారు. దీంతో మండల సీనియర్ నాయకులు బీజేపీ వైపు చూస్తున్నారు.

ఫలిస్తున్న ఈటల మంత్రాంగం..

ఈటల రాజేందర్ సీనియర్ నాయకుడు కావడం, లౌక్యం తెలిసిన నాయకుడు కావడం, అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన నేర్చుకున్న గుణపాఠాలతో ప్రతి ఓటు కోసం ఏ అవకాశాన్ని వదలడం లేదు. ఒకనాడు వెలుగు వెలిగి ఆ తర్వాత స్తబ్దుగా ఉన్న నాయకులను, రాజకీయ సీనియర్లుగా ఉన్న వారిని ఆయన నేరుగా ఇంటికి వెళ్లి కలుస్తూ తనకు అండగా ఉండాలని, బీజేపీలో చేరాలని కోరుతున్నారు. తమను గుర్తించి ఇంటి వరకు వచ్చిన నాయకుడి కోసం అంటూ స్థానిక నేతలు ఆయన బాటలో వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. ఆయన నేతల ఇళ్లకు వెళ్లడం, పాత రోజులను గుర్తు చేయడంతో ఆయన నడుపుతున్న మంత్రాంగాలు సఫలం అవుతున్నాయి.

క్యూ కడుతున్న నేతలు..

ఈటల రాజేందర్ మిత్రుడు పూడూర్ మాజీ సర్పంచ్ నర్సింహారెడ్డి బీఆర్‌ఎస్‌లో ఉంటూ చాలా రోజులుగా ఈటలకు మద్దతుగా నిలుస్తున్నారు. ఆయన పాత నాయకులను ఏకం చేస్తూ అందరినీ బీజేపీలో చేర్చేలా ముందుండి నడిపిస్తున్నారు. మేడ్చల్‌లో అత్యంత సీనియర్ నాయకుడు నారెడ్డి నందారెడ్డి, మరో నాయకుడు నర్సింహారెడ్డి, సీనియర్లు మాజీ మండల పరిషత్ ఉపాధ్యక్షుడు సద్ది బలరాంరెడ్డి, మేడ్చల్ మాజీ సర్పంచ్ మురళీధర్‌గుప్తా వంటి నాయకులు బీజేపీలో చేరడానికి ఇప్పటికే గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశారు. మండల ప్రధాన నాయకులతో పాటు అగ్ర నాయకుల అనుచర గణం బీజేపీలో శనివారం ఏర్పాటు చేసిన సభలో చేరతారని నాయకుడు నందారెడ్డి తెలిపారు.

గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీకి చెందిన బీఆర్‌ఎస్ కౌన్సిలర్ మల్లికార్జున్‌ముదిరాజ్ మరి కొంతమంది కౌన్సిలర్లు, వివిధ పార్టీల నాయకులు బీజేపీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు సమాచారం.

నేటి కార్యక్రమాలు

శనిత్రయోదశి ప్రత్యేక పూజలు

మోతీనగర్: పర్వత్‌నగర్ ప్రధాన రోడ్డులోని పర్వతవర్ధిని శివాలయంలో శని త్రయోదశిని పురస్కరించుకొని ఈనెల 23న ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది.శివాలయంలో శనిపూజ, తైలాభిషేకం, నవగ్రహ పూజ నిర్వహిస్తారు. అదేవిధంగా స్వామివారికి ఉదయం 6గంటలకు పంచామృతాభిషేకం, విశేషపూజ, స్వామికి చామంతి పుష్పాలతో అలంకరణ ఉంటుంది.

నేటి నుంచి పశువుల సంత

మోతీనగర్: మూసాపేట డివిజన్ పరిధిలోని బబ్బుగూడలో ప్రతి శని, ఆదివారాల్లో పశువుల సంత కొనసాగుతుంది. ఈ సంతకు నగరంతో పాటు వివిధ జిల్లాల ప్రజలు, రైతులు వచ్చి అమ్మకాలు, కొనుగోలు చేపడతారు.

శ్రీవారి కల్యాణం

మోతీనగర్: మూసాపేట డివిజన్ పాండురంగనగర్‌లోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ప్రతి శనివారం శ్రీవారి కల్యాణం నిర్వహిస్తారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీవారి కల్యాణాన్ని తిలకించాలని ఆలయ కార్యనిర్వహన అధికారి జీఏకే కృష్ణ తెలిపారు.

బీజేపీ బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ న్యూ వివేకానందనగర్ బావార్చి హోటల్ వీధి నం.9లోని సర్కిల్‌లో శనివారం బీజేపీ బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్ ఉంటుందని జిల్లా బీజేపీ సెక్రటరి పులిగొల్ల శ్రీనివాస్ యాదవ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.30గంటలకు నిర్వహించే ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మల్కాజ్‌గిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి, జాతీయ కార్యవర్గ సభ్యులు ఈటల రాజేందర్ విచ్చేయనున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి డివిజన్ పరిధిలోని అన్ని విభాగాల అధ్యక్షులు, అన్ని మోర్చాల నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అన్నదానం

మూసాపేట: కూకట్‌పల్లి ఐడీఎల్ రంగనాయకస్వామి ఆలయంలో శనివారం అన్నదానం కార్యక్రమం ఉంటుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ప్రతి శనివారం ఉదయం ప్రత్యేక పూజల అనంతరం మధ్యాహ్నం 12.30 గంటల నుంచి అన్నదానం ప్రారంభమవుతుందన్నారు.

కూరగాయల ధరలు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి రైతు బజార్‌లో కూరగాయల ధరలు కిలో రూపాయల్లో.. టమాట 11, వంకాయ18, బెండకాయ45, పచ్చిమిర్చి 50, బజ్జిమిర్చి40, కాకరకాయ 35, బీరకాయ 45, క్యాబేజి 23, బీన్స్ 45, క్యారెట్ 21, గోబి పువ్వు 18, దొండకాయ 23, చిక్కుడుకాయ 50, గోరుచిక్కుడు35, బీట్‌రూట్19, క్యాప్సికం 65, ఆలుగడ్డ21, కీరా 23, దోసకాయ 15, సొరకాయ 9, పొట్లకాయ 18, కంద 23, ఉల్లి పొరక 35, ఉల్లిగడ్డ 22, మామిడికాయ 10 నుంచి 15, అరటికాయ 8 నుంచి 9, చామగడ్డ 40, ముల్లంగి4 నుంచి 6, చిలగడ దుంప 15, గుమ్మడికాయ 23, నిమ్మకాయలు 55 నుంచి 60, మునగకాయలు 5 నుంచి 6, పచ్చిబఠాణి 51, బొప్పాయి40, పుట్టగొడుగులు40, ఎండుమిర్చి 220, అల్లం 160, వెల్లుల్లి 180, చింతపండు 140, పండుమిర్చి 80, ఉసిరి 40, వేరుశెనగ నూనె 165, పామాయిల్ నూనె 97లుగా ఉన్నాయి. ఈ ధరలు శనివారం ఉదయం 9గంటల వరకు అమలులో ఉంటాయి.

ముస్లింలకు ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేయాలి

• బీఆర్‌ఎస్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు సయ్యద్ ఎజాజ్
• ప్రభుత్వం రంజాన్ తోఫాలు ఇవ్వాలని విజ్ఞప్తి


ఓల్డ్‌బోయిన్‌పల్లి బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న సయ్యద్ ఎజాజ్

ఓల్డ్‌బోయిన్‌పల్లి: సుమారు పదేళ్లు మాజీ సీఎం కేసీఆర్ అన్ని మతాల పండగలకు ప్రాధాన్యం ఇస్తూ ప్రజలు సంతోషంగా జరుపుకునేలా ఎంతో కృషి చేశారని బీఆర్‌ఎస్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు సయ్యద్ ఎజాజ్ అన్నారు. శుక్రవారం ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో పండగలు వస్తే ప్రజలకు ప్రోత్సహకాలను అందించే వారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత పేద ముస్లిం కుటుంబాల్లో పండగ వాతావరణమే పోయిందన్నారు. రంజాన్ పండగ వస్తే కెసిఆర్ రంజాన్ తోఫాలతో పాటు అన్ని ప్రాంతాల్లో ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేసేదన్నారు. ప్రస్తుత పరిస్థితి దీనికి బిన్నంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.

◆ రంజాన్ మాసం ప్రారంభమై 12 రోజులు గడిచినప్పటికీ ఇప్పటి వరకు ఇఫ్తార్ విందులు, రంజాన్ కానుకలు ఇవ్వకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. తూతూమంత్రంగా ఎల్‌బీస్టేడియంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసి కార్పొరేటర్లు, మైనార్టీ పెద్దలను ఆహ్వానించకపోవడం బాధాకరమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అడుగులకు మడుగులు వత్తే వారినే పిలిపించుకుని ఆగమేఘాల మీద ఇఫ్తార్ విందు నిర్వహించడం ఏమిటని ప్రశ్నించారు.

◆ ఇప్పటికైన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముస్లిం ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం అవ్వాలన్నారు. డివిజన్ల వారీగా రంజాన్ పర్వదినానికి నిధులు విడుదల చేయాలన్నారు. రంజాన్ తోఫాలతో పాటు ఇఫ్తారు విందులను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు ఖదీర్, మమమ్మద్ అర్షద్, మహమ్మద్ ఖాజా, మిరాజ్, ముస్తాఫా, అబ్దుల్ ఖయ్యూమ్ తదితరులు పాల్గొన్నారు.

ఠాణా గోడదూకి చైన్‌స్నాచర్ పరార్

• కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్‌లో ఘటన • సిబ్బంది నిర్లక్ష్యంపై విచారణకు డీసీపీ ఆదేశం

భాగ్యనగర్‌కాలనీ: వృద్ధురాలి మెడలోని మంగళసూత్రం లాక్కెళ్లిన కేసులో ఓ వ్యక్తిని గురువారం పోలీసులు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్ పెట్టారు. ఠాణాలో ఉన్న నిందితుడు పోలీసుల కళ్లుగప్పి స్టేషన్ నుంచి పరారయ్యాడు.

అసలు ఎందుకు అరెస్టు చేశారు..

ఈనెల 12వ తేదీ ఉదయం వాకింగ్‌కు వెళుతున్న మల్లవ్వ అనే మహిళ మెడలోనుంచి ఓ గుర్తు తెలియని వ్యక్తి మంగళసూత్రం లాక్కెళ్లిన సంగతి విదితమే. దీనిపై అదే రోజు మల్లవ్వ కేపీహెచ్‌బీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. గురువారం కేపీహెచ్‌బీలో అనుమానస్పదంగా తిరుగుతున్న అభినవ్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్న బాలానగర్ ఎస్ఓటీ పోలీసులు చైన్‌స్నాచర్‌గా గుర్తించారు. తదుపరి విచారణ నిమిత్తం నిందితుడిని కేపీహెచ్‌బీ పోలీసులకు అప్పగించారు.


టాయిలెట్‌కు అని చెప్పి గోడదూకి పరార్...

గురువారం సాయంత్రం టాయిలెట్‌కు వెళతానని చెప్పిన అభినవ్ పోలీస్‌స్టేషన్ వెనుకకు వెళ్లి కానిస్టేబుల్ కళ్లుగప్పి ఒక్కసారిగా గోడ దూకి పరారయ్యాడు. సమాచారం అందుకున్న ఏసీపీ శ్రీనివాసరావు, బాలానగర్ డీసీపీ టి. శ్రీనివాసరావులు పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. అదుపులో ఉన్న దొంగ గోడ దూకి పారిపోవటంలో నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై డీసీపీ అంతర్గత విచారణకు ఆదేశించినట్లు సమాచారం.

అనుమానాస్పదస్థితిలో చెరువులో పడి వ్యక్తి మృతి

మూసాపేట: అనుమానాస్పద స్థితిలో చెరువులో పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... హస్తల్‌పూర్ గ్రామం మెదక్‌జిల్లాకు చెందిన జానపాటి బాషా(28) భార్య, ముగ్గురు పిల్లలతో హెచ్‌ఎంటీ శాతవాహన నగర్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. 21వ తేదీ రాత్రి 12.10 గంటలకు పెద్ద కుమారుడికి ఆరోగ్యం బాగాలేకపోవటంతో మందుల కోసం మెడికల్ షాపుకి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. భార్య కవిత బంధువుల ఇళ్లు, తెలిసిన వారి వద్ద వాకబు చేసినా అతడి ఆచూకీ లభించలేదు. మృతుడు భార్య కవిత రాత్రి 1.30 గంటలకు కూకట్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. శుక్రవారం ఉదయం 6గంటలకు చెరువులో మృతదేహం ఉందని సమాచారం సమాచారం అందింది. వెంటనే అక్కడకు చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసు పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అతడి మృతికి గల కారణాలను తెలుసుకోవడానికి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.




చెరువులో జానపాటి బాషా మృతదేహం

గొల్ల, కురుమలను విస్మరించిన పార్టీలకు గుణపాఠం తథ్యం

పంజగుట్ట: రాష్ట్రంలో 18 శాతం జనాభా ఉన్న గొల్ల, కురుమలను అన్ని రాజకీయ పార్టీలు దగా చేస్తున్నాయని యాదవ, కురుమ సంఘాల రాజ్యాధికార ఐక్యవేదిక ఆరోపించింది. తమ ఓట్లతో అధికారం చేపట్టి పదవులు ఇచ్చే విషయంలో మాత్రం తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆగ్రహంవ్యక్తం చేసింది. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మేమెంతో మాకంత అనే నినాదంతో ఐక్యవేదిక ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. మేకల కృష్ణ యాదవ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి వివిధ కుల సంఘాల, రాజకీయ పార్టీల నాయకులు ప్రొఫెసర్ సింహాద్రి యాదవ్, ప్రొఫెసర్ బీనవేని రామ యాదవ్, క్యామ మల్లేష్, దూదిమెట్ల బాలరాజ్ యాదవ్, రమేష్ యాదవ్‌లు మాట్లాడుతూ .. రాష్ట్రంలో గొల్ల, కురుమల మద్దత్తుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు వారిని పూర్తిగా విస్మరించిందన్నారు. లోక్‌సభ సీట్లతో పాటు, నామినేటెడ్ పోస్టుల్లో కూడా సముచిత స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. గొల్ల, కురుమలను విస్మరించే పార్టీలను రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెపుతామని హెచ్చరించారు. తమ జనాభా దామాషా ప్రకారం 3 మంత్రి పదవులు, 2 ఎంపీ, 13 కార్పొరేషన్ చైర్మన్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటివరకు ప్రకటించిన 37 కార్పొరేషన్ చైర్మన్‌లల్లో ఒక్కటి కూడా యాదవ, కురుమలకు ఇవ్వకపోవడం దారుణమని, ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఎప్పుడు చూసినా యాదవులు లేని మంత్రివర్గం లేదని మొదటిసారి యాదవులకు మంత్రివర్గంలో స్థానం కల్పించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

చోరీకి వచ్చి.. కిచెన్‌లో నక్కి.. చిక్కిన దుండగుడు

బంజారాహిల్స్: బేగంపేట సంఘటన జరిగి ఒక రోజు గడువకముందే బంజారాహిల్స్‌లో అర్ధరాత్రి ఓ ఇంట్లోకి దుండగుడు చొరబడి విలువైన వస్తువుల కోసం వెతికాడు. టాయిలెట్ కోసం అప్పుడే లేచిన ఇంటి యజమానిని చూసి కిచెన్‌లో దాక్కున్నాడు. తిరిగి వచ్చాక దుండగుడిని చూసిన సదరు యజమాని కేకలు వేయడంతో చుట్టుపక్కల వారంతా వచ్చి పట్టుకున్నారు. అతని వద్ద వెతకగా ఓ మొబైల్ ఫోన్ దొరికింది. బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. బంజారాహిల్స్ ఎంబీనగర్ రోడ్డులో ఉండే దండగూడ కృష్ణ(41) రోజువారీ కూలీగా పనిచేస్తుంటాడు. రోజుమాదిరిగా బుధవారం రాత్రి కుటుంబసభ్యులతో కలిసి నిద్రపోయాడు. అర్ధరాత్రి దాటిన తరువాత 2 గంటల సమయంలో టాయిలెట్ కోసం లేచి బయటకు వెళ్ళి వచ్చేసరికి ఓ వ్యక్తి కిచెన్ దాక్కున్నాడు. వెంటనే దొంగ..దొంగ..అని అరవగా కుటుంబసభ్యులతో పాటు చుట్టుపక్కల వారు వచ్చి అతనిని పట్టుకున్నారు. అతని వద్ద కృష్ణకు చెందిన శాంసంగ్ ఫోన్ దొరికింది. పోలీసులకు సమాచారం అందించగా అక్కడికి వచ్చి విచారించగా రామకృష్ణగా గుర్తించారు. కృష్ణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వైద్యుడిగా చెలామణి అవుతున్న వ్యక్తి అరెస్టు

అమీర్‌పేట: అమీర్‌పేటలోని ఓ ప్రముఖ ఆస్పత్రిలో సీనియర్ రెసిడెంట్ వైద్యుడిగా చలామణి అవుతున్న వ్యక్తిని ఎస్ఆర్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. సరూర్‌నగర్ కర్మాన్‌ఘాట్‌కు చెందిన తోట దిలీప్‌కుమార్ 2022 ఆగస్టు 3న ప్రైమ్ ఆసుపత్రిలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎమర్జెన్సీలో సీనియర్ రెసిడెంట్ వైద్యుడిగా డ్యూటీలో చేరాడు. అతడి సర్టిఫికెట్లు రెన్యువల్ చేయించే క్రమంలో అనుమానం రావడంతో సర్టిఫికెట్లను మెడికల్ కౌన్సిల్‌లో వెరిఫికేషన్ కోసం పంపారు. ఒర్జినల్ రిజిస్ట్రేషన్ ఐడీలో నకిలీ వ్యక్తులు దూరి పేర్లు నమోదు చేసుకున్నారని పేర్కొంటూ 2022లో రిజిస్టర్ ఆఫ్ తెలంగాణ మెడికల్ కౌన్సిల్ అధికారులు సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేసిన దాంట్లో దిలీప్‌కుమార్ పేరు కూడా ఉన్నట్లు గుర్తించారు. దీంతో ఆస్టర్ ప్రైమ్ ఆసుపత్రి హెచ్.ఆర్.హెడ్.వెంకటేష్ చౌహాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దిలీప్‌ను అరెస్టు చేశారు. 2012లో చైనాలో ఎంబీబీఎస్ పూర్తి చేసిన దిలీప్ పర్మనెంట్ మెడికల్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ కోసం మెడికల్ కౌన్సిల్ నిర్వహించే పరీక్షలో అర్హత సాధించలేదు. తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసే కందుకూరి అనంతకుమార్ సహాయంతో అసలైన వైద్యుల స్థానంలో దిలీప్‌కుమార్ పేరును రిజిస్ట్రేషన్ చేయించుకుని నగరంలోని వివిధ ఆసుపత్రుల్లో విధులు నిర్వహించినట్లు గుర్తించారు.